ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 27 డిసెంబరు 2024




కృష్ణాపురం జలాశయం

వైసీపీ హయాం ఐదేళ్లలో జలవనరుల శాఖ పూర్తి నిస్తేజంగా మారిపోయింది. పుంగనూరు నియోజకవర్గంలో కొత్తగా ఎంఐ ట్యాంకుల నిర్మాణానికి రూ.వంద కోట్లు, జైకా-ఏపీఐఐఏటీపీ పథకాల నుంచి రూ.50 కోట్లు మాత్రమే విడుదల చేశారు.

జలవనరుల మీద పూర్తి స్థాయిలో దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం ఇప్పటికే హంద్రీనీవా కుప్పం, పుంగనూరు బ్రాంచి కెనాల్స్ పనుల కోసం రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. రూ.25 కోట్ల నీరు ప్రగతి బకాయిల్ని విడుదల చేయగా, మరో రూ.20 కోట్ల బకాయిల విడుదల పురోగతిలో ఉంది. ఉమ్మడి జిల్లాలో కృష్ణాపురం, బహుదా, పెద్దేరు, కాళంగి ప్రాజెక్టుల రిపేర్ల కోసం ఇప్పటికే సుమారు రూ.3కోట్లను విడుదల చేసింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● తొలి సగం: హంద్రీనీవా డ్రామా

వైసీపీ హయాంలో ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన అప్పటి సీఎం జగన్ రామకుప్పం మండలానికి వచ్చి హంద్రీనీవా కుప్పం బ్రాంచి కెనాల్ నుంచి నీళ్లను విడుదల చేసి హడావిడి చేశారు. ఐదేళ్ల పాటు పట్టించుకోని ఆయన ఎన్నికల సమయంలో హంగామా చేయడంతో స్థానికులకు అనుమానం వచ్చింది.అనుకున్నట్లే మరుసటి రోజు ఉదయం ఆయన నీళ్లను వదిలిన గేటును తీసుకెళ్లిపోయారు. కాలువలో ప్రవాహం ఆగిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ విషయం చర్చకు దారి తీయడంతో జగన్ నవ్వుల పాలయ్యారు. 2019 నాటికి 90 శాతం పూర్తి చేసిన కుప్పం కెనాల్ పనుల్ని ఐదేళ్లలోనూ జగన్ పూర్తి చేయలేకపోయారు.


రామకుప్పంలో నీటిని విడుదల చేస్తున్న జగన్

● మలి సగం: పనులు ప్రారంభం


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుప్పం బ్రాంచి కెనాల్‌తో పాటు మొత్తం హంద్రీనీవా ప్రధాన కాలువ మీదే చంద్రబాబు దృష్టి పెట్టారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే జూన్ 25న ఆయన రామకుప్పంలోని కుప్పం కెనాల్‌ను పరిశీలించారు. ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.వాటికి అనుగుణంగా కుప్పంతో పాటు పుంగనూరు బ్రాంచి కెనాల్‌కూ కాంక్రీట్ లైనింగ్, విస్తరణ కోసం విడతల వారీగా ఈ నెలలోనే సుమారు రూ.వెయ్యి కోట్లను విడుదల చేశారు.

● తొలి సగం
నీరు ప్రగతి బిల్లులు ఆపేశారు

2014-19సంవత్సరాల నడుమ టీడీపీ పాలనలో చేపట్టిన నీరు ప్రగతి పనులకు సంబంధించిన బిల్లుల్ని వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. ఐదేళ్ల పాటు వేధించిన వైసీపీ ఎవరైనా కోర్టుకు వెళితే అలాంటివారికి మాత్రమే రూ.20 కోట్ల వరకు బిల్లులు చెల్లించింది.

● మలి సగం
రూ.కోట్ల బకాయిల విడుదల

నీరు ప్రగతి పాత బిల్లుల్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే బిల్లుల్ని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయించుకుని ఇప్పటివరకు జిల్లాలో సుమారు రూ.25 కోట్ల వరకు నిధుల్ని విడుదల చేసింది. ఇంకా రూ.20 కోట్ల బిల్లుల్ని ఇరిగేషన్ అధికారులు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నారు. రెండు నెలల్లో పూర్తి బిల్లుల్ని క్లియర్ చేయనున్నారు.


అడవిపల్లె రిజర్వాయర్

● తొలి సగం

చిత్తూరుకు నీళ్ల తేవాలని 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వం రూ.250 కోట్లతో అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరు వరకు 92 కిలోమీటర్ల మేర పైపులైను పనులు ప్రారంభించింది. 45 కిలోమీటర్ల పైపులైను పనులు పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ పనుల్ని ఏడాది పాటు ఆపేసి.. ఆ తర్వాత 20 కిలోమీటర్ల పైపులైను ఏర్పాటు చేసింది. పెండింగులో ఉన్న 27 కిలోమీటర్ల పైపులైను పనుల్ని పట్టించుకోలేదు.

● మలి సగం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అడవిపల్లె నుంచి చిత్తూరుకు నీళ్ల తెచ్చే పైపు లైను పనుల్లో కదలిక వచ్చింది. నేషనల్ హైవేస్ అనుమతి రాని చోట మినహా మిగిలిన చోట పనుల్ని చేస్తున్నారు. దీంతో పాటు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చొరవ తీసుకుని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో.. 0.785 టీఎంసీల అడవిపల్లె రిజర్వాయర్ నీళ్లను చిత్తూరుకు కేటాయిస్తున్నట్లు నవంబరు 14న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నివర్ తుఫాను నష్టాల్నీ పట్టించుకోని వైసీపీ

2021 చివర్లో నివర్ తుఫాను ఉమ్మడి చిత్తూరు జిల్లాను అతలాకుతలం చేసింది. ప్రాణ, ఆస్తి, పశు నష్టాలు జరిగాయి. ఈ క్రమంలోనే జిల్లాలోని 624 చెరువులకు గండ్లు పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.10 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.240 కోట్లు అవసరమని అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపించినా.. అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో స్థానిక నాయకుల చొరవ వల్ల తాత్కాలికంగా మట్టి పోసి కొంత పనులు చేశారు.

2014-19 మధ్య రూ.650 కోట్లతో పనులు

2014-19 సంవత్సరాల మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం జలసంరక్షణతో పాటు భూగర్భ జలాల అభివృద్ధి కోసం నీరు- ప్రగతి పేరుతో కార్యక్రమాన్ని చేపట్టింది. చెక్‌డ్యాముల మరమ్మతులు, కొత్తవాటి నిర్మాణం, చెరువుల అభివృద్ధి, జంగిల్ క్లియరెన్సు, కాలువల పునరుద్ధరణ వంటి జలసంరక్షణ పనులు చేపట్టారు. 2015 నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ కార్యక్రమం ద్వారా రూ.650.28 కోట్ల విలువైన 5978 పనులు మంజూరయ్యాయి. వీటిలో 366.26 కోట్ల అంచనాతో 3697 పనులు దశల వారీగా పూర్తయ్యాయి. వీటిలో 3068 చెక్‌డ్యాం పనులు, 304 సరఫరా కాలువల పనులు, 180 జంగిల్ క్లియరెన్సు పనులు, 2430 చెరువుల అభివృద్ధి పనులను చేపట్టారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక రూ.120 కోట్ల విలువ చేసే 713 పనులను రద్దు చేసింది. పూర్తయిన పనులకు సంబంధించిన రూ.140 కోట్ల బిల్లులను విజిలెన్సు విచారణ పేరుతో ఆపేశారు.



అందాల పోటీల్లో మెరిసిన పాదిరేడు అమ్మాయి


జాతీయ స్థాయి అందాల పోటీల్లో నగరి నియోజకవర్గ పరిధిలోని వడమాలపేట మండలం పాదిరేడుకు చెందిన అల్లూరు సుజన మిస్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్ అవార్డు దక్కించుకున్నారు. ఈ నెల 21న న్యూఢిల్లీలోని పశ్చిమ విహార్ హోటల్లో జాతీయ స్థాయి అందాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సుజన ప్రతిభ కనబరిచి మిస్ ఇండియా-2024 ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. కలికిరి జేఎన్‌టీయూలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తనకు కాగ్నిజెంట్ సంస్థలో ఉద్యోగ అవకాశం లభించినట్లు ఆమె చెప్పారు. పుత్తూరులో నివాసముంటోన్న తల్లిదండ్రులు విశ్రాంత ఉపాధ్యాయురాలు పార్వతి, సెరికల్చర్ ఆఫీసర్ సుబ్రమణ్యం ప్రోత్సాహంతోనే తనకు ఈ అవార్డు దక్కిందన్నారు సుజన.

- పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

జనవరి తొలివారంలో కుప్పానికి సీఎం

● పలు పరిశ్రమలకు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కుప్పం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే నెలలో కుప్పం రానున్నారు. టీడీపీ వర్గాల సమాచారం మేరకు.. జనవరి 4,5 లేదా 5, 6 తేదీలలో ఆయన పర్యటన వుండనుంది. ప్రత్యేకించి ఈసారి ఆయన పర్యటనలో పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగే అవకాశముంది.నాల్గవసారి ముఖ్యమంత్రిగా జూన్ 12న బాధ్యతలు స్వీకరించాక అదే నెల 25, 26 తేదీల్లో చంద్రబాబు రెండురోజుల పాటు కుప్పంలో పర్యటించారు.హంద్రీ-నీవా కాలువను పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో బహిరంగ సభలో పాల్గొని నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. గత అయిదేళ్లలో అభివృద్ధి ఆగి, అధోగతిపాలైన కుప్పాన్ని ఈ అయిదేళ్లలో ముందుకు తీసుకుపోతానని, ఇంతకు రెండుమూడు రెట్లుగా అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.మూడు నెలలకోసారి కుప్పం పర్యటనకు వచ్చి ప్రజలను కలిసి, వారి సాదకబాధకాలు తెలుసుకుంటానని, అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తానన్నారు. అయితే గత ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన విధ్వంసాన్ని, ఆర్థిక లోటును సరిచేసే పనివొత్తిడిలో ఇంతదాకా చంద్రబాబు కుప్పం రాలేకపోయారు. ఈ మధ్యలో ముఖ్యమంత్రి సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి రెండు పర్యాయాలు కుప్పంలో పర్యటించి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తరపున అభివృద్ధి హామీలు ఇవ్వడమేకాదు, ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కారాలకు హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు తరపున పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ నేపథ్యంలో జనవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రత్యేకించి పలు పరిశ్రమలు, సంస్థల ఏర్పాటుకు ఆయన శంకుస్థాపనలు చేయనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. గుడుపల్లె మండలం పొగురుపల్లె సమీపంలో సుమారు 54.86 ఎకరాలను ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కోసం ఇప్పటికే కేటాయించారు. అలాగే శాంతిపురం మండలం తమ్మిగానిపల్లె వద్ద కృషి విజ్ఞాన కేంద్రంకోసం 50.21 ఎకరాల కేటాయింపు జరిగింది. ఆయా ప్రాంతాలలో నిర్దేశిత పరిశ్రమలకు, సంస్థలకు సీఎం చంద్రబాబు తన పర్యటనలో శంకుస్థాపనలు చేసే అవకాశం వుందని సమాచారం.



జనన ధ్రువీకరణ పత్రాల కేసులో
ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్

రామకుప్పం/శాంతిపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో చోటు చేసుకున్న నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల బాగోతంపై కలెక్టరు సుమిత్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. రామకుప్పం మండలానికి చెందిన నెట్ సెంటర్ల నిర్వాహకులతో కుమ్మక్కయి, డిజిటల్ కీని దుర్వినియోగం చేశారని శాంతిపురం మండలానికి చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండు చేశారు.ఈనెల ప్రారంభంలో రామకుప్పం మండలంలోని కొందరు పంచాయతీ కార్యదర్శులు నకిలీ జననధ్రువీకరణ పత్రాలను గుర్తించి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆయన కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు దృష్టికి తీసుకెళ్లగా నియోజకవర్గంలోని పలు నెట్ సెంటర్లను తనిఖీ చేశారు. రామకుప్పం మండలంలోని పలు నెట్ సెంటర్లలో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు తయారీ, పంపిణీ జరిగినట్లు గుర్తించారు.మండల కేంద్రమైన రామకుప్పంతో పాటు వీర్నమల, ముద్దనపల్లెల్లోని నెట్‌సెంటర్లలో నకిలీ పత్రాల తయారీ, విక్రయాలు జరిగినట్లు గుర్తించారు. ఆ మూడు చోట్ల నెట్ సెంటర్ల నిర్వాహకులను విచారించారు.వీర్నమల నెట్ సెంటర్ నిర్వాహకుడు మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తితో వాట్సాప్ ద్వారా పరిచయం పెంచుకుని డాష్‌బర్త్.ఇన్.నెట్ అనే వెబ్‌పోర్టల్ యాక్సెస్ తీసుకున్నాడు. ఆ పోర్టల్ ద్వారా నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు తయారీ, విక్రయాలకు తెరదీశాడు. ఇక్కడి వ్యక్తుల వివరాలను మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తికి పంపి నకిలీ ధ్రువీకరణ పత్రాలను వెబ్‌పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేవాడు. దీని కోసం ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.200 చెల్లించేవాడు. వాటిని ప్రజలకిచ్చి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేసేవాడు. నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల తయారీకి అనంతపురం జిల్లా కమలపాడు పంచాయతీ కార్యదర్శి, జగ్గంపేట మున్సిపాల్టీ పేరిట డిజిటల్ సంతకాలతో ధ్రువీకరణ పత్రాలు విక్రయించాడని అధికారుల విచారణలో తెలిసింది. రామకుప్పం, ముద్దనపల్లె నెట్ సెంటర్ల నిర్వాహకులు శాంతిపురం మండలం రాళ్ళబూదుగూరు, కర్లగట్ట, రామకుప్పం పంచాయతీ కార్యదర్శుల లాగిన్లలో వారి డిజిటల్ సంతకాలతో ధ్రువీకరణ పత్రాలను జనానికి అందించారని వెల్లడైంది.ముద్దనపల్లె నెట్ సెంటర్ నిర్వాహకుడు ధ్రువీకరణ పత్రాలను బైరెడ్డిపల్లె, వాల్మీకిపురం ప్రాంతాల వారికి అందించగా వారు ఒక్కో ధ్రువీకరణ పత్రాన్ని రూ.1000 నుంచి రూ.1500 వరకు విక్రయించేవారు. నవంబరు 10 నుంచి ఈ దందా సాగుతోందని విచారణలో తేలింది. ఈ దందాపై రామకుప్పం ఎంపీడీవో ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు నెట్ సెంటర్ల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. శాఖాపరమైన విచారణలో శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ కార్యదర్శి బంగారునాయక్, రాళ్ళబూదుగూరు పంచాయతీ కార్యదర్శి సాదిక్‌అలీ డిజిటల్ కీని దుర్వినియోగపరిచి, నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు జనానికి అంటగట్టేందుకు నెట్ సెంటర్ల నిర్వాహకులకు సహకరించారని అధికారులు నిర్ధారించారు. దీనిపై వారు కలెక్టరుకు నివేదిక పంపారు. దీంతో గురువారం ఆ ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను కలెక్టరు సస్పెండు చేశారు.


సాదిక్‌అలీ


బంగారు నాయక్

కుప్పానికి క్రాక్ అకాడమీ

● త్వరలో తరలిరానున్న ప్రఖ్యాత కోచింగ్ సెంటర్!

● 100మంది పేద పిల్లలకు ఉచిత శిక్షణ

కుప్పం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహా నగరాల్లో సివిల్స్ పరీక్షలతో పాటు ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ రంగాల్లో అత్యుత్తమ కేడర్లలో ప్రవేశానికి జరిగే పోటీ పరీక్షల కోసం శిక్షణ ఇస్తున్న ప్రఖ్యాతి వహించిన క్రాక్ అకాడమీ కుప్పం తరలిరానుంది. ఇక్కడి నిరుపేదలకు ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ ఇవ్వనుంది. క్రాక్ అకాడమీలో ఉచిత శిక్షణకోసం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వంద మంది విద్యార్థులను ఎంపిక చేసేందుకు వచ్చే నెల 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 19 నుంచి 22వ తేదీదాకా కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ట్రస్టు తరపున నిర్వహిస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు హాజరై, అక్కడి శిక్షణార్థులతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆమెకు ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌ను కూడా కుప్పంలో నడపాలన్న సూచన కొందరి నుంచి అందింది. అయితే ఇప్పటికే ఈ ప్రయత్నాలు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారని, పక్కనే ఉన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆమెకు సమాచారం అందించారు. దీంతో అతి త్వరలో ప్రభుత్వం తరఫునే ప్రారంభించనున్నట్లు ఆమె హామీ ఇచ్చారు. ఢిల్లీ, హైదరాబాదు తదితర నగరాలలో కోచింగ్ ఇస్తున్న ప్రఖ్యాత క్రాక్ అకాడమీతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపిందన్న సమాచారం అప్పుడే బయటకు వచ్చింది. కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో విద్యాశాఖ దీనికోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది.

● కుప్పం చిన్నారులకు వరం

క్రాక్ అకాడమీ ద్వారా ఇవ్వనున్న కోచింగ్ కుప్పం చిన్నారులకు ఒక వరంగా పరిణమించనుంది. కుప్పం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వంద మంది పేద, మెరిట్ పిల్లలకు ఉచితంగా క్రాక్ అకాడమీలో శిక్షణ ఇవ్వడానికి అకాడమీ యాజమాన్యాన్ని ప్రభుత్వం ఒప్పించింది. ప్రవేశ పరీక్ష రాయడానికి మెరిట్ స్టూడెంట్స్‌ను ఎంపిక చేయాల్సిందిగా ఆయా పాఠశాలలకు సుమారు వారం రోజుల ముందే కడా పీడీ తరపున ఎంఈవోల ద్వారా ఉత్తర్వులు వెళ్లాయి.ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొంతమంది విద్యార్థులను ఎంపిక చేసి ఉంచారు. దీనిపై గురువారం జిల్లా విద్యాశాఖాధికారి బి.వరలక్ష్మి, డిప్యూటీ ఈవో చంద్రశేఖర్ కుప్పం మండల సచివాలయంలో నాలుగు మండలాల ఎంఈవోలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా పాఠశాలల్లో 9, 10 తరగతులు చదివే మెరిట్ పిల్లలనే ప్రవేశ పరీక్షకు ఎంపిక చేశారు. క్రాక్ అకాడమీ ద్వారా పిల్లలకు చిన్న తరగతులనుంచే ఐఏఎస్, లేదా అత్యున్నత ఐపీఎస్, ఇతర కేడర్లలోని ఉద్యోగాలు లక్ష్యంగా కోచింగ్ ఇప్పించడం, తద్వారా వారిని ఇప్పటినుంచే ఆయా పరీక్షలకు సిద్ధం చేయడం దీని ఉద్దేశం. ఇప్పటికే కుప్పం ప్రాంతంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ప్రైవేటు కోచింగ్ సెంటర్లు టైఅప్ చేసుకుని పిల్లలకు ఇటువంటి శిక్షణను ఇస్తున్నాయి. ఇదే శిక్షణను ఎటువంటి రుసుము లేకుండా క్రాక్ అకాడమీ ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేసిన 100 మంది చిన్నారులకు అందిస్తుందన్న మాట. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎంపిక చేసిన విద్యార్థుల జాబితాను డీఈవో గురువారం కడా పీడీకి వికాస్ మర్మత్‌కు అందజేశారు. విద్యాశాఖాధికారులతో ఆయన దీనిపై చర్చించారు. క్రాక్ అకాడమీ గురించి కడా పీడీ వికాస్ మర్మత్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వందమంది పేద విద్యార్థులకు అకాడమీ ద్వారా ఉచితంగా కోచింగ్ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇందుకోసం ఈనెల 6వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.ఈ ప్రవేశ పరీక్షను మెరిట్‌లో ఉత్తీర్ణులైన మొదటి 100 మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని ఇవ్వనున్నట్లు చెప్పారు.


హెచ్‌ఎంల సమావేశంలో ప్రసంగిస్తున్న డీఈవో

2.6 కిలోల గంజాయి స్వాధీనం
- ఐదుగురి అరెస్టు -

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 2.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. గురువారం చిత్తూరు ఒకటో పట్టణ పోలీసులకు వచ్చిన రహస్య సమాచారంతో సిబ్బంది ఎన్టీఆర్ బస్టాండ్ పక్కనే ఉన్న ప్రదేశంలో కొంగారెడ్డిపల్లెకు చెందిన ఉమాశంకర్, జగదీశ్‌లను తనిఖీ చేశారు. వారి వద్ద కొన్ని గంజాయి ప్యాకెట్లు ఉండటంతో అదుపులోకి తీసుకుని విచారించారు. జింకలపార్కు వద్ద న్యూ బాలాజీ కాలనీకి చెందిన మహమ్మద్ సుహైల్, మార్కెట్ వీధికి చెందిన గౌస్‌ఖాన్, రామ్‌నగర్‌కాలనీకి చెందిన చేతన్ ప్రసాద్‌ల నుంచి గంజాయిని కొని, విక్రయిస్తున్నట్లు తేలింది. దీంతో మొత్తం ఐదుగురినీ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 61,800 విలువైన 2.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. పరారీలోని మరో నిందితుడిని త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.



అమ్మవారి సేవలో పీవీ సింధు దంపతులు

తిరుచానూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం మధ్యాహ్నం భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు దంపతులు దర్శించుకున్నారు. నూతన జంట సింధు, వెంకట దత్త సాయి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోగా టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు ఆలయ మర్యాదలతోస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని పీవీ సింధు దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద వీరికి టీటీడీ క్యాలెండర్, డైరీని భానుప్రకాష్‌రెడ్డి అందజేశారు. అనంతరం అలిపిరి నడకమార్గంలో తిరుమల చేరుకున్న వీరు.. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఏడు మండలాల్లో వర్షం

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు మండలాల్లో వర్షం కురిసింది. బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 8 గంటల్లోపు నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. మండలాల వారీగా.. నింద్రలో 5.2, కార్వేటినగరం, పాలసముద్రంలో 4.2, విజయపురంలో 3.8, చౌడేపల్లెలో 2, వెదురుకుప్పం, కుప్పం మండలాల్లో 1.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

41 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల ఆరో తేదీనుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. గురువారం 41 గ్రామాల్లో సదస్సులు జరిగాయి. ఇప్పటి వరకు సదస్సులు జరిగిన గ్రామాల సంఖ్య 522కి చేరింది. గురువారం జరిగిన సదస్సుల్లో 750 మంది రైతులు హాజరవగా, ఇప్పటి వరకు 27,640 మంది సదస్సుల్లో పాల్గొన్నారు.



‘కొండ’ంత జనం

వరుస సెలవులతో భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఎటు చూసినా రద్దీనే కనిపిస్తోంది. సర్వదర్శన క్యూ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దాదాపు 20 గంటల దర్శన సమయం పడుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈనెల 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు గురువారం తెలిపారు. జిల్లాలో 2,63,995 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.112 కోట్లు కేటాయించిందన్నారు. 31న అందని వారికి జనవరి 2వ తేదీన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

శిలాతోరణం సర్కిల్ దాకా క్యూలైన్

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. శిలాతోరణం సర్కిల్ వరకు క్యూలైన్‌లో భక్తులు వేచివున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.14 కోట్లు


బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,301

తలనీలాలు సమర్పించినవారు: 26,242



బొక్కసం సూపరింటెండెంట్‌గా

మళ్లీ గురురాజ్ స్వామి



- గత ప్రభుత్వంలో కక్షసాధింపు చర్యలకు గురైన వైనం
- తొలుత ఆలయం, ఆపై తిరుమల నుంచే బదిలీ
- తాజాగా శ్రీవారి ఆలయంలో పోస్టింగ్

తిరుపతి/తిరుమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం బొక్కసం సూపరింటెండెంట్‌గా గురురాజ్ స్వామి గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వంలోని అధికారులు కక్షసాధింపుతో ఆయన్ను మార్చిలో శ్రీవారి ఆలయం నుంచి తిరుపతికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. శ్రీవారి ఆలయంతో ఎంతో అనుబంధమున్న ఆయన తిరుమల నుంచి వెళుతూ కన్నీరు పెట్టుకోవడం అప్పట్లో చర్చనీయాశంగా మారింది. ఈయన గురురాజ్ స్వామి 2002లో టీటీడీలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. తొలి నుంచీ శ్రీవారి ఆలయంలోనే విధులు నిర్వర్తించారు. ఆపై బొక్కసం క్లర్కుగా, తర్వాత బొక్కసం సూపరింటెండెంట్‌గా పదోన్నతులు పొందారు. శ్రీవారి ఆలయంలో బొక్కసం ఇంచార్జి డాలర్ శేషాద్రి వద్ద సహాయకుడిగా ఉంటూ శ్రీవారి కైంకర్యాలు, పూజాదికాలు, ప్రత్యేక దినాలు, ఉత్సవాల్లో కార్యక్రమాల నిర్వహణపై అవగాహన పెంచుకున్నారు. ముఖ్యంగా బొక్కసం క్లర్కుగా, సూపరింటెండెంట్ హోదాల్లో శ్రీవారి ఆలయంలో మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు రోజువారీ, ప్రత్యేక దినాల్లో అలంకరించే అత్యంత విలువైన ఆభరణాలు, బంగారు, వెండి వస్తువులన్నీ ఈయన అధీనంలోనే ఉండేవి. మూలవిరాట్టుకు, ఉత్సవరకుల ఏ రోజుల్లో ఏ ఆభరణాలు అలంకరించాలన్న దానిపైనా లోతైన అవగాహన ఉంది. ఆలయంలో అర్చకులకు, టీటీడీ అధికారులకు నడుమ సంధానకర్తగా, సమన్వయకర్తగానూ వ్యవహరించేవారు. సుమారు రెండు దశాబ్దాల పాటు శ్రీవారి ఆలయంలో పని చేసినా ఆయనపై ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులూ వచ్చిన దాఖలాలు లేవు. అయితే శ్రీవారి ఆలయంలో కీలకంగా వ్యవహరించే క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులతో పరిచయాలు ఏర్పడ్డాయి. సరిగ్గా అక్కడే గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఉన్నతాధికారి ఒకరికి నచ్చలేదన్న ప్రచారం జరిగింది. ఆ కారణంగా గురురాజ్‌స్వామిని తొలుత 2020లో శ్రీవారి ఆలయం నుంచి వెలుపలికి బదిలీ చేశారు. వైభవోత్సవ మండపంలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. తర్వాత ఈ ఏడాది మార్చి 8న తిరుమల నుంచీ తిరుపతిలోని టీటీడీ అకౌంట్స్ విభాగానికి బదిలీ చేశారు. అదే రోజున ఆయన శ్రీవారిని దర్శించుకుని ఆలయం నుంచీ వెలుపలికి వచ్చి విలపిస్తూ వెళ్లిపోయారు. వాస్తవానికి డాలర్ శేషాద్రి మరణంతో ఆయన స్థానాన్ని గురురాజ్‌స్వామితో భర్తీ చేస్తారని టీటీడీ వర్గాలు భావిస్తున్న తరుణంలో ఆయన్ను ఏకంగా తిరుమల నుంచే కిందకు బదిలీ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ శ్రీవారి సన్నిధిలోనే గడిపానని, వైభవోత్సవ మండపానికి బదిలీ చేసినా కొండపైనే శ్రీవారి ఆలయ సమీపాన్నే కాబట్టి సంతోషంగా విధులు నిర్వర్తించానని అప్పట్లో ఆయన సన్నిహితులకు చెప్పుకొన్నారు. అయితే కొందరు కక్షకట్టి తిరుమలలోనే ఉండకుండా బదిలీ చేయించడం తట్టుకోలేకపోతున్నానంటూ వాపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీటీడీపై దృష్టి సారించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శ్రీవారి ఆలయంలో బొక్కసం నిర్వహణకు, అలాగే అర్చకులు, అధికారుల నడుమ సమన్వయానికి సంబంధించి అవగాహన కలిగిన ఉద్యోగులు లేకపోవడాన్ని ఉన్నతాధికారులు గుర్తించినట్టు సమాచారం. దీంతో గురురాజ్‌స్వామిని తిరిగి శ్రీవారి ఆలయానికి బదిలీ చేస్తూ గురువారం టీటీడీ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ బదిలీకి సంబంధించి ఎలాంటి మార్పుచేర్పులు, రద్దు వంటి అభ్యర్థనలను, ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకునేది లేదంటూ ఈ ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. ఈ విధంగా ఏ స్థాయి అధికారికి గానీ బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొనడం అత్యంత అరుదనే చెప్పాలి. స్వామివారే తన సేవకు మళ్లీ పిలిపించుకున్నారని గురురాజ్‌స్వామి ‘ఆంధ్రజ్యోతి’తో సంతోషం వ్యక్తం చేశారు.

ఎర్రెర్రని జెండా

- ఘనంగా సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవం

జిల్లాలో గురువారం సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎర్ర తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలతో తిరుపతి నగరం ఎరుపెక్కింది. అన్నమయ్య కూడలి నుంచి బైరాగిపట్టెడలోని పార్టీ కార్యాలయం వరకు కళాబృందాలతో ర్యాలీ నిర్వహించారు. పద్మావతి పార్క్ వద్ద కేక్ కట్ చేశారు. పార్టీ కార్యాలయంలో పతాకావిష్కరణ చేశారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పార్టీ వందేళ్ల చరిత్రను గుర్తు చేస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి. అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి ముందుకురావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, కె.శివారెడ్డి, సి.పెంచలయ్య, రాధాకృష్ణ, బి.నదియా, చంద్రశేఖరరెడ్డి, ఎన్.డి.రవి, గుర్రప్ప, నాగరాజు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి



పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న హరినాథ రెడ్డి తదితరులు



తిరుపతిలో సీపీఐ నేతల ర్యాలీ

పడవ పోటీల ప్రాక్టీస్ సెషన్స్ ప్రారంభం



రాయలచెరువులో బోట్లను పరిశీలిస్తున్న శాప్‌చైర్మన్ రవినాయుడు

రామచంద్రాపురం/తిరుపతి(క్రీడలు), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం రాయలచెరువులో గురువారం పడవ (డ్రాగన్ బోట్) పోటీల ప్రాక్టీస్ సెషన్స్ ప్రారంభమయ్యాయి. చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, విజయవాడ, వైజాగ్ జిల్లాల నుంచి జూనియర్, సీనియర్ విభాగాలకు 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ప్రాక్టీసు సెషన్స్ కొనసాగాయి. చెరువులో 1,000మీటర్ల పొడవుతో 30రౌండ్స్ వేశారు. ఒక్కోదానిలో 12మంది చొప్పున కూర్చొని పడవను వేగంగా ముందుకు నడిపారు. చిన్న పడవల్లో ఒక్కొక్కరూ నడిపారు. క్రీడాకారులు చేస్తున్న పొరపాట్లను అక్కడే ఉన్న కోచ్‌లు గమనించి ముఖకవళికలతో కూడిన శిక్షణ ఇచ్చారు. ఇలా 29వ తేదీ వరకు ప్రాక్టీస్ సెషన్స్ చేస్తూ 30, 31 తేదీల్లో అధికారిక టైమింగ్స్‌కు పడవ పోటీలు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచినవారు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. గురువారం శాప్‌చైర్మన్ రవినాయుడు రాయలచెరువులో పర్యటించి పడవ పోటీల ప్రాక్టీస్ సెషన్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, రాయలచెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు దేవరాజులు, రాయలచెరువుపేట సర్పంచ్ మురగయ్య, మాజీ సర్పంచ్ మాధవి, నీటి సంఘాల అధ్యక్షులు నరసింహారెడ్డి, ఎంపీడీవో ఇందిరమ్మ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమజంట ఆత్మహత్యకు యత్నించిన ఘటన చిత్తూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరికి చెందిన గురవయ్య కుమారుడు భరత్ (21), కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తాయమ్మ కుమార్తె రాజేశ్వరి (19)లు తిరుపతిలోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఐదునెలలుగా ప్రేమించుకున్న వీరు గురువారం చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ గుడిలో వివాహం చేసుకున్నారు. భరత్ స్నేహితుడు చిత్తూరులోని రామ్‌నగర్‌కాలనీ విస్డమ్ స్కూల్ సమీపాన నివాసం ఉండగా, సాయంత్రం అక్కడికి చేరుకున్నారు. తర్వాత స్నేహితుడికి ఫోన్ చేయగా అతను స్పందించక పోవడంతో భయపడి తమ వెంట తెచ్చుకున్న రసాయనాన్ని తాగేశారు. స్థానికులు గమనించి, వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. పోలీసులు విచారిస్తున్నారు.

పరిశ్రమలు వస్తున్నాయి.. సహకరించండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పలు పరిశ్రమలు వస్తున్నాయని, భూసేకరణకు సహకరించాలని సత్యవేడు మండల రైతులను కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సత్యవేడు మండలం తొల్లడం, పెద్దఈటిపాకం, ఇరుగళం, చిన్న ఈటిపాకం రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లోని సుమారు 55.66 ఎకరాల భూసేకరణకు ఈనెల 15న ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. అందులో 40 ఎకరాల పట్టా భూమి ఉందని, ఆ మేరకు రైతులతో నష్టపరిహారంపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి కలెక్టర్ చర్చించారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పాల్గొన్నారు.

తిరుమలలో రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): టీటీడీ డయల్ యువర్ ఈవో కార్యక్రమం శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమలలో జరుగనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో శ్యామలరావుతో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడవచ్చు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు: 0877 2263261.

ఆగివున్న లారీని ఢీకొన్న మినీలారీ

- డ్రైవర్ మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ ముందుభాగం - లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజా

దొరవారిసత్రం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి మినీలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన మినీలారీ డ్రైవర్ రాజా కరుపాల్యా(27) మృతి చెందాడు. సౌక కొయ్యల లోడుతో వెళ్తున్న లారీ టైరు పంక్చర్ కావడంతో కుప్పారెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆగింది. బత్తాయి పండ్ల లోడుతో గుజరాత్ నుంచి చెన్నై వెళ్తున్న మినీలారీ బుధవారం అర్ధరాత్రి ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సౌక కొయ్యలు మినీలారీ క్యాబిన్‌లోకి చొచ్చుకుపోవడంతో డ్రైవర్ రాజా తీవ్రంగా గాయపడ్డారు. హైవే మొబైల్ పోలీస్ సిబ్బంది స్థానికుల సహకారంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజా కరుపాల్యాను బయటకు తీసి 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గదుల జారీని పర్యవేక్షిస్తున్న అదనపు ఈవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గదుల జారీ ప్రక్రియను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సిఫార్సులున్నప్పటికీ తిరుమలలో గదులు కేటాయించే పద్మావతి, ఎంబీసీ34 కార్యాలయాల వద్ద భక్తులు అధిక సమయం నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని ‘ఆంధ్రజ్యోతి’ ప్రచురించిన విషయం తెలిసిందే. వెంకయ్య చౌదరి పద్మావతి విచారణ కార్యాలయానికి వెళ్లి ఏఏ సిఫార్సులపై గదులు కేటాయిస్తున్నారు, ఏ సమయంలో ఎన్ని గదులు భక్తులు పొందుతున్నారు, అవకతవకలు ఏమైనా జరుగుతున్నాయా, భక్తులకు ఎందుకు ఆలస్యం అవుతోంది, ఎక్కడ గదులు బ్లాక్ అవుతున్నాయి వంటి అంశాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా లభ్యతను బట్టి గదులు కేటాయించాలని, వీలైనంతవరకు నిరీక్షణ సమయాన్ని తగ్గించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

రేణిగుంటలో డెంగ్యూ కేసు నమోదు

రేణిగుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : రేణిగుంటలో డెంగ్యూ కేసు నమోదైంది. రేణిగుంట పంచాయతీ పరిధిలోని బుగ్గవీధిలో ఓ మహిళకు డెంగ్యూ పాజిటివ్‌గా వైద్యులు నిర్ధారించారు. గురువారం ఆ ప్రాంతంలో చుట్టుపక్కల ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారి వద్ద ఏఎన్ఎంలు రక్తనమూనాలు సేకరించారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. డెంగ్యూ జ్వరం పట్ల ప్రజలు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఇంటిలోపల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ ప్రకాష్‌రెడ్డి సూచించారు.

టీటీడీ నిధుల వ్యయానికి ‘చికిత్స’

- కొన్ని ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాలకు భారీగా నిధుల కేటాయింపు అవసరమా..
- పరిశీలనకు తాజాగా కమిటీ నియామకం

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాల వ్యయంపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. రూ.వేల కోట్ల నిధులను ఆస్పత్రుల పేరుతో మళ్లించడం ఏమేరకు సమంజసమనే దిశగా యోచిస్తోంది. ఇటీవల దీనిపై ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. టీటీడీ మాజీ ఈవో, పూర్వపు జిల్లా కలెక్టర్, హెల్త్ స్పెషల్ సెక్రటరీగా పనిచేసి రిటైరైన ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో కమిటీ ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రులను, భవన నిర్మాణాలను పరిశీలించింది. టీటీడీ ఆధ్వర్యంలో స్విమ్స్, ఆయుర్వేద, బర్డ్ వంటి ఆస్పత్రులు నడుస్తున్నాయి. మరోపక్క గత వైసీపీ ప్రభుత్వంలో పద్మావతి చిన్న పిల్లల హృదయాలం ఆస్పత్రి నిర్మాణ పనులనూ ప్రారంభించింది. దీని నిర్మాణానికే దాదాపు రూ.300 కోట్లకుపైగానే కేటాయించింది. స్విమ్స్‌లో బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ విభాగం, మరో భారీ భవన నిర్మాణాలకు రూ.200 కోట్లకుపైగా కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో మరికొన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు కూడా భారీగా నిధులు కేటాయిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. వాటిన్నిటికీ దాదాపు రూ.వెయ్యి నుంచి రూ.1,200 కోట్ల వరకు అవసరమవుతుంది.

టాటా సంస్థ ఉండగా మళ్లీ కేన్సర్‌కు నిధులా..

వాస్తవానికి క్యాన్సర్ రోగులకోసం ఇప్పటికే టాటా ట్రస్టు వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రిసెర్చ్, కాంప్రెస్ క్యాన్సర్ ఆస్పత్రి (స్వీకార్) నిర్మించి సేవలు అందిస్తోంది. ఈక్రమంలో మళ్లీ బాలాజీ ఇనిస్టిట్యూట్ అంకాలజీ ఎందుకని భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం టీటీడీ ఆదాయం కంటే ఖర్చే అధికంగా ఉంటోందని ప్రస్తుత అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాలకు ఈస్థాయిలో నిధులు అవసరమా అనే కోణంలో విశ్లేషిస్తున్నారు. గత ప్రభుత్వంలోని అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని భావిస్తున్నారు. స్విమ్స్ నిర్వహణే సక్రమంగా లేనప్పుడు కోట్లాది రూపాయల కేటాయించడం ఎంతమేరకు సబబనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రత్యేక కమిటీ ఈ మొత్తం వ్యవహారంపై నివేదిక ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

వైసీపీ కార్పొరేటర్ల కొత్త కూటమి

- ఎన్డీయే స్థానిక నేతలను మెప్పించిన తర్వాతే ఆయా పార్టీల్లోకి
- అప్పటివరకు స్వతంత్రంగానే వ్యవహరిస్తాం
- పలు అంశాలపై సుదీర్ఘ చర్చ



సమావేశమైన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, వైసీపీ కార్పొరేటర్లు

తిరుపతి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కొందరు వైసీపీ కార్పొరేటర్లు కొత్త కూటమిగా ఏర్పాటవుతున్నారు. ఎన్నికల అనంతరం ఎన్డీయే కూటమిలో చేరేందుకు పలువురు విఫలయత్నం చేసిన విషయం తెలిసిందే. ఇందుకు గల అడ్డంకులను సమీక్షించుకుని, వాటిని అధిగమించి టీడీపీ, జనసేనలో చేరేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఈమేరకు గురువారం అందుబాటులో ఉన్న దాదాపు 10 మంది కార్పొరేటర్లు పాయ్‌వైస్రాయ్ హోటల్లో సమావేశమై చర్చించుకున్నారు. గత వైసీపీ పాలనలో టీడీపీ, జనసేన శ్రేణులను ఇబ్బందిపెట్టని కార్పొరేటర్లను చేర్చుకునేందుకు ఎన్డీయే ప్రభుత్వానికి ఇబ్బందిలేదని, గతంలో తామలా వ్యవహరించలేదు కాబట్టి పార్టీలో చేరేందుకు ఎలాంటి అడ్డంకులు ఉండవని అభిప్రాయపడ్డారు. అయితే ఆయా డివిజన్లలోని స్థానిక నాయకత్వాన్ని కూడా మెప్పించి పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. తద్వారా భవిష్యత్తులో ఎలాంటి గందరగోళం లేకుండా ముందుకుపోవచ్చని భావించారు. గత కౌన్సిల్ తీర్మానం మేరకు కార్పొరేటర్లకు నెలలో ఒకసారి శ్రీవారి దర్శనం కల్పించాలని కోరుతూ టీటీడీ చైర్మన్‌ను కలవాలని నిర్ణయం తీసుకున్నారు. ఏదైనా పార్టీలో చేరేవరకు తాము ఎవరికీ అనుకూలంగా ఉండమని, అవిశ్వాసం కూడా పార్టీ నిర్ణయాలమేరకు ఉంటుందని తీర్మానం చేసుకున్నట్టు తెలిసింది. ఈసమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహాచారి (25వ డివిజన్), నరేంద్రనాథ్ (38), దూది కుమారి భర్త శివ(33), కుడితి సుబ్రమణ్యం (36), పొన్నాల చంద్ర (28), దొడ్డారెడ్డి మునిశేఖర్ (11), అనిల్ (50వ డివిజన్) సమావేశానికి హాజరైనట్టు తెలిసింది. మరికొంతమంది ఫోన్ ద్వారా సంఘీభావం తెలిపినట్టు సమాచారం.

- అన్నమయ్య విగ్రహం ఘటనలో

నిందితుడి అరెస్టు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అన్నమయ్య సర్కిల్‌లోని అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ పెట్టిన నిందితుడిని ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. అన్నమయ్య విగ్రహానికి టోపీ పెట్టడంతో దుమారం రేగింది. భజరంగదళ్ నాయకులు విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఎంఆర్ పల్లి పరిధిలోని ఉల్లిపట్టెడకు చెందిన ఎస్.విష్ణుప్రతీక్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అన్నమయ్య సర్కిల్ వద్ద లభించిన సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ఇతడు మహారాష్ట్రలోని పర్భనీ తాలూకా పెడ్గోన్ గ్రామానికి చెందిన భందుదార్జి జవహర్‌గా గుర్తించారు. 15 రోజుల కిందట తిరుపతికి వచ్చిన ఇతడు.. చిత్తు పేపర్లు ఏరుకుంటూ ప్లాట్‌ఫారాలపై పడుకునేవాడు. ఈనెల 23న శాంతాక్లాజ్ టోపీ దొరకగా అన్నమయ్య విగ్రహంపై ఉంచాడు. ఇతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

పశుగణనను వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పశుగణన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారరం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. పాల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ ద్వారా పశుగ్రాసం పెంపకం, మినీ గోకుల షెడ్ల నిర్మాణ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, అధికారులు ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన ఆ శాఖ అధికారులతో సమీక్షించారు.

ఎస్వీయూ స్టోర్స్ ఆరోపణలపై విచారణ ముమ్మరం

తిరుపతి, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని కో ఆపరేటివ్ స్టోర్స్ గత వైసీపీ పాలనలో పక్కదారి పట్టింది. దాన్ని రాజకీయ కేంద్రంగా మార్చేసి అక్రమ నియామకాలకు తెరలేపినట్టు వెలుగులోకి వచ్చింది. ఒక్కసారి కూడా సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా వైసీపీ తరఫున చక్రంతిప్పే ఒక ప్రొఫెసర్ రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారన్న విమర్శలు వచ్చాయి. అతని అనుయాయులను ఉద్యోగులుగా నియమించినట్టు తెలిసింది. ఈ క్రమంలో కొంతమంది ఉద్యోగులు దౌర్జన్యంగా స్టోర్ వ్యవహారాల్లో కీలకంగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు, తెలుగు యువత సంయుక్తంగా కోఆపరేటివ్ స్టోర్స్ జిల్లా అధికారికి మూడు నెలల ముందు కోరాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టడంతో పలు అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తున్నట్టు తెలుస్తోంది. గురువారం కూడా ఎస్వీయూ స్టోర్‌లో విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్కే నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి షైలారి అశోక్‌లను శుక్రవారం విచారించి, వారి వద్ద ఉన్న ఆధారాలను అధికారులు సేకరించనున్నారు.



ఆలయం ముందు జస్టిస్ టీసీడీ శేఖర్

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, టేబుల్‌టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



జస్టిస్ దుప్పల వెంకటరమణ - నైనా జైస్వాల్

రెవెన్యూ సదస్సులకు 730 అర్జీలు


తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 48 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 730 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. అందులో ఇళ్ల స్థలాల కోసం 114, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్‌పై 45, కుల ధ్రువీకరణ కోసం 1, రీసర్వే 29, ల్యాండ్ గ్రాబింగ్ 11, ఆర్‌వోఆర్ 345, ఇతర విషయాలకు 129 ఉన్నాయని వివరించారు. 58 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 12,306 అర్జీలు వచ్చాయన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. పరీక్షలను పర్యవేక్షిస్తున్న హైపవర్ కమిటీ మదనపల్లె ప్రాంతంలోని పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురిని గుర్తించి, డీబార్ చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

మహిళలపై దాడిచేస్తే కఠినంగా శిక్షించాలి

- మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. కఠినమైన శిక్షలు అమలుచేస్తేనే నేరాలు చేయాలనుకునేవారిలో భయం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. అప్పుడే ఆడవారికి నిజమైన రక్షణ కల్పించవచ్చన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన.. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా జరిగిన క్రమంలో శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. స్వామిని దర్శించుకోమని ఎవరు ఎలాంటి ప్రచారం చేయకపోయినప్పటికీ రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుండటం శ్రీవారి మహిమ అన్నారు.

జలకళతో చెరువులు

వరి సాగుకు రైతన్న సిద్ధం ● టమోటా సాగుకు లీజు భూముల కోసం అన్నమయ్య జిల్లా రైతన్నల అన్వేషణ




సోమలలో వరి సాగు కోసం దుక్కులు చేసిన పొలం - చెన్నపట్నం చెరువు

సోమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు సోమల మండలంలోని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ఎండిపోయిన బోర్లు రీఛార్జి అయ్యాయి. దీంతో రైతన్నలు ఉత్సాహంగా వరి సాగుకు సిద్ధమయ్యారు.అయితే మంచు తీవ్రంగా కురుస్తుండడంతో వరి నార్లు ఆలస్యమవుతున్నాయి.సోమల మండలంలో వరి సాగు సాధారణంగా 2300 ఎకరాలు ఉండగా.. ఇప్పటికే 1200 ఎకరాలను సాగుకు సిద్ధం చేశారు. మరి కొందరు ఫిబ్రవరి, మార్చి నెలల్లో టమోటా సాగుకోసం భూములు దుక్కులు చేసి పశువుల ఎరువులు, కోళ్ల ఎరువులతో పొలాలను నింపుకుంటున్నారు.ఈ ఏడాది మండలంలో 1000 ఎకరాలకు మించి టమోటా సాగయ్యే అవకాశముంది.అన్నమయ్య జిల్లాలో ఫిబ్రవరి, మార్చి అనంతరం టమోటా సాగుకు అక్కడి వాతావరణం అనుకూలించకపోవడంతో సోమల, చౌడేపల్లె తదితర మండలాల్లో టమోటా సాగుకు కలకడ, కలికిరి, దేవపట్ల, మహల్ ప్రాంతాల రైతులు వస్తున్నారు. ఇక్కడి రైతుల పొలాలను 4, 5 నెలల పాటు కౌలుకు తీసుకుని టమోటా సాగు చేస్తారు.ముందుగానే భూముల సారవంతం కోసం ఉలవలు, జీలుగ, పిల్లిపెసర లాంటి పంటలు విత్తుకుంటున్నారు. 40 రోజుల అనంతరం ఆ పంటలను భూముల్లో కలియదున్నడం ద్వారా సారవంతం చేసుకుని జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో టమోటా సాగు చేస్తారు.ఇప్పటికే అన్నమయ్య జిల్లా రైతులు సోమల మండలానికి చేరుకుని లీజు భూముల అన్వేషణలో పోటీ పడుతున్నారు. ఇక్కడ సొంత భూమి వున్నా సాగు చేయలేని వారు, టమోటా సాగుకు భారీ పెట్టుబడులు పెట్టలేని పలువురు రైతులు తమ పొలాలను లీజుకు ఇస్తున్నారు.

బస్సులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం



బస్సులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుత్తణి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):తిరుపతి నుంచి బస్సులో తరలిస్తున్న 25 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి సమీపంలోని పొన్పాడి చెక్‌పోస్ట్‌లో బుధవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న బస్సులో ప్రయాణికుల లగేజీ తనిఖీ చేయగా, 25 కిలోల గంజాయి లభ్యమైంది. ఈ వ్యవహారంలో చిరువానూరుకు చెందిన దినేష్, ప్రతాప్‌కుమార్, విజయ్ ఆంధ్రాలో గంజాయి కొనుగోలు చేసి కాంచీపురం తరలిస్తున్నట్లు తెలియడంతో అరెస్ట్ చేశారు. అలాగే, మరో బస్సులో తనిఖీలు చేపట్టిన పోలీసులు, నిషేధిత 6 కిలోల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని చిత్తూరు జిల్లా నగరి సమీపంలో ఓజీకుప్పానికి చెందిన అరుణ్‌ను అరెస్ట్ చేశారు.

బొమ్మసముద్రం సర్పంచ్‌కు అభినందన



రఘును అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఆరోగ్య పంచాయతీగా బొమ్మసముద్రం మొదటి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో డీపీవో సుధాకర్‌తో కలిసి బొమ్మసముద్రం సర్పంచ్ రఘు గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. దీంతో రఘును కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీలను ప్రగతిపథంలో నడపడంతోపాటు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణను పకడ్బందీగా చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో పార్వతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవాలు



ఎర్రజెండాలతో ప్రదర్శన చేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవాలు గురువారం నగరంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు మాట్లాడుతూ.. దేశంలో 90 శాతం పేద, మధ్యతరగతి, కార్మికుల అండదండలతో సుదీర్ఘప్రస్థానం సాగించిన ఏకైక పార్టీ సీపీఐ మాత్రమేనని అన్నారు. దేశంలో అందరికీ విద్య, ఉపాధి, కార్మిక హక్కులు, భూసంస్కరణలు, అంటరానితనం వంటి సామాజిక సమస్యలపైన పోరాడి అనేక చట్టాలను సాధించిందన్నారు. అనంతరం సీపీఐ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ఎర్రజెండాలతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు గోపీనాథ్, మణి, చంద్ర, విజయకుమార్, జమీలాబీ, రమాదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు సిలబస్ పూర్తి చేయండి : డీఈవో



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెలాఖరులోపు సిలబస్ పూర్తి చేయాలని డీఈవో వరలక్ష్మి ఆదేశించారు. డివిజన్ స్థాయి సమావేశంలో భాగంగా చిత్తూరులో జరిగిన ఎంఈవో, హెచ్‌ఎంల సమావేశంలో పలు అంశాలపై సూచనలిచ్చారు. జనవరి నుంచి రివిజన్ ప్రారంభించాలన్నారు. టెన్త్ విద్యార్థులకు నిర్వహించే తరగతులు, సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. జనవరి 6వ తేదీలోపు చర్చాపే కార్యక్రమాలను పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించి.. అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలోనూ సైన్స్ ఫెయిర్ నిర్వహించి, విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలికి తీయాలన్నారు. రిటైర్‌మెంట్ వివరాలను అందజేయడంతోపాటు ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాల, పని సర్దుబాటు సమాచారం ఇవ్వాలని కోరారు. టీచర్స్ స్టూడెంట్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని.. తేడాలు రాకూడదన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతోపాటు వంటశాలలు శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవో శెల్వరాజ్, మోహన్, హసన్‌బాషా, హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్‌తోపాటు ఏసీ, గీజర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ రిపేరు చేయడం తదితరాలపై నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పీడీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 28నుంచి 31వ తేదీలోపు వివరాలను మెప్మా కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 17వ తేదీ ఉదయం 11 గంటలకు సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులందరూ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 77802 85604 నెంబరును సంప్రదించాలని కోరారు.

పంటలను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు



పత్రపల్లె గ్రామ శివారులో ధ్వంసమైన అరటిచెట్లు

యాదమరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాచూరు అటవీ బీట్ పత్రపల్లె, పెరగాండ్లపల్లె, తంజావూరు ప్రాంతంలో వరి, అరటి, బొప్పాయి పంటలను బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు తొక్కి.. ధ్వంసం చేసింది. తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు మహదేవ, రాజు, పట్టాభి, వినాయకం ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా బంగారుపాళ్యం, యాదమరి సరిహద్దుల్లో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు ప్రస్తుతం రాచూరు, బోడబండ్ల బీట్ ప్రాంతంలో రంగనాయకులచెరువు అటవీ సమీపం, తెల్లరాళ్ళపల్లె క్వారీ సమీపంలో గురువారం తిష్ట వేసిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనావాసాల్లోకి రాకుండా అటవీ సిబ్బంది ట్రాకర్ల ద్వారా బాణాసంచా పేల్చి అడవిలోకి మళ్లించే ప్రయత్నం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఏనుగుల దాడుల నివారణకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గందరగోళంగా రుద్రాభిషేకం!

● అవస్థలు పడుతున్న భక్తులు



శ్రీకాళహస్తీశ్వరాలయం

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రుద్రాభిషేకం క్రతువు గందరగోళంగా సాగుతోంది. పూజలకు హాజరయ్యే పలువురు భక్తులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. సాధారణంగా ఎక్కడైనా రోజుకు ఒకసారి లేదా విశేష రోజుల్లో మూలమూర్తి అభిషేకాలను నిర్వహిస్తుంటారు. శ్రీకాళహస్తిలో మాత్రం ప్రతిరోజు నాలుగు కాలాల అభిషేకం జరగడం విశేషం. ఇందులో మూడు కాలాల్లో జరిగే అభిషేకానికి భక్తులను అనుమతిస్తారు. ఈక్షేత్రంలో మొదట అమ్మవారికి అభిషేకం నిర్వహించి ఆ తరువాత స్వామివారిని అభిషేకించడం ప్రత్యేకత. ఇంతటి ప్రాశస్త్య క్షేత్రం కావడంతో భక్తులు రుద్రాభిషేకాన్ని జరుపించుకునేందుకు ఎంతో ఆసక్తి చూపుతుంటారు. అభిషేకానికి ముందుగా సహస్ర లింగం వద్ద తూర్పు దిశగా భక్తులను ఉంచి సంకల్పం స్వీకరిస్తారు. సుమారు గంట పాటు భక్తులు సంకల్పం పూజలో కూర్చోవాలి. సహస్ర లింగంవద్ద భక్తులు నేలమీదనే కుర్చోవాల్సి వస్తోంది. కీళ్ల సమస్య ఉన్నవారు, వృద్ధులు, దివ్యాంగులు అంత సమయం కింద కూర్చోలేక ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా చిన్న పీటలు వంటివి ఇవ్వాలని వీరిలో చాలామంది సిబ్బందిని అడుగుతుంటారు. సంకల్పం పూజలు తర్వాత అమ్మవారి సన్నిధికి చేరుకుని అక్కడ అభిషేకం వీక్షించాలి. ఆ తరువాత స్వామివారి సన్నిధికి చేరుకుని అభిషేకాన్ని జరిపించుకోవాలి. మొత్తం రుద్రాభిషేకం పూర్తయి భక్తులు ఆలయం వెలుపలకు వచ్చే సరికి మూడు గంటలు పడుతుంది. ముందుగా సంకల్పం వద్ద నిలబడే భక్తులకు మొత్తం అభిషేకాన్ని పూర్తిచేసే సరికి నీరసించిపోతున్నారు. ఇక, రుద్రాభిషేకం సంకల్ప పూజల్లో గోత్రనామాలను స్వీకరించిన తరువాత పండితులు వేదమంత్రాలు, రుద్రపారాయణం చేస్తారు. ఈ మంత్రోచ్చరణలను శ్రద్ధతో శ్రవణం చేస్తేనే అభిషేక ఫలితంప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. అయితే సహస్రలింగం వద్ద మూడు వైపులా రూ.5వేల రాహుకేతు పూజలను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిత్యం నిర్వహిస్తుంటారు. సరిగ్గా అక్కడే రుద్రాభిషేకం సంకల్ప పూజలకూ స్థానం కేటాయించారు. సంకల్ప పూజల సమయంలో మూడు వైపులా రాహుకేతు పూజల మంత్రాలు గట్టిగా మైకులో చెబుతుంటారు. అక్కడే రుద్రపారాయణం కూడా కొనసాగుతోంది. దీంతో ఏ మంత్రాలో అర్థం కాక భక్తులు గందరగోళానికి గురవుతున్నారు. రూ.5వేల రాహుకేతుపూజలు అయినా, లేదా రుద్రాభిషేకం సంకల్పస్థానాన్ని అయినా సహస్ర లింగం వద్ద నంచి మార్చాలని భక్తులు కోరుతున్నారు.

ఎన్‌సీడీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాన్ కమ్యూనికబుల్ డిసీజస్ (ఎన్‌సీడీ) సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎన్‌సీడీ సర్వే మెడికల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి.. ఆరోగ్య పరీక్షలు చేశాక డిజిటలైజేషన్ పూర్తిచేయాలన్నారు. మహిళల్లో క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే గైనకాలజిస్టుతో పరీక్షించి స్క్రీనింగ్ పరీక్షల నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి పంపాలన్నారు. పుట్టినబిడ్డ నుంచి ఐదేళ్లలోపు వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి.. తగిన వ్యాక్సినేషన్ చేయాలన్నారు. డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్‌ఎస్ ప్రభావతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపేటకు తరలిస్తున్న 9క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

పుంగనూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలుతున్న తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పుంగనూరు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ ఈచర్ వాహనంలో 9క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి డ్రైవర్‌ను విచారించగా రాయచోటి నుంచి బంగారుపేటకు తరలిస్తున్నట్లు తెలపడంతో వాహనాన్ని సీజ్ చేసి స్థానికపోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.రేషన్‌బియ్యాన్నిరెవెన్యూ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సొంతూరును మరువను : ఎంపీ ప్రసాదరావు



సభలో మాట్లాడుతున్న ఎంపీ ప్రసాదరావు

చినగంజాం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తనకు ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించిన సొంతూరు చింతగుంపల్లిని ఎప్పుడూ మరువనని చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు.ప్రకాశం జిల్లా చినగంజాం మండలంలోని చింతగుంపల్లికి గురువారం వచ్చిన ఆయన గ్రామస్తులతో మాట్లాడారు.చింతగుంపల్లి అభ్యున్నతికి చేయూతనందించేందుకు ఎప్పుడూ వెనకాడనన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సత్కార సభలో ప్రసాదరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. అనంతరం ఎంపీ ప్రసాదరావును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.సర్పంచ్ యార్లగడ్డ సత్యనారాయణ, విశ్రాంత అధ్యాపకులు శ్రీరామమూర్తి, న్యాయవాది కరణం వాసుదేవరావు, ఎంపీడీవో ప్రభుదాస్, రిటైర్డ్ డీఎస్పీ కట్టా వినయ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన వెల్లుల్లి

తిరుపతి(నేరవిభాగం),డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వెల్లుల్లి ఘాటెక్కింది. మూడు నెలల కిందటి వరకు కిలో రూ.280 నుంచి 340 వరకు పలికింది. నేడు ఏకంగా రూ.480కి చేరింది. డిమాండుకు సరిపడా రాకపోవడమే కారణమని అంటున్నారు. ఎందుకంటే తిరుపతి మార్కెట్‌కు వారానికోసారి దాదాపు 60 టన్నులు వస్తాయి. ఇప్పుడు 25 టన్నులు రావడమే గగనంగా ఉందని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. జిల్లాకు అత్యధికంగా మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర నుంచి వెల్లుల్లి వస్తుంది. అక్కడ కూడా దిగుబడి లేకపోవడం.. వచ్చే వెల్లుల్లి కూడా ముళబాగల్, కోలారు, కేజీఎఫ్ ప్రాంతాలకు అత్యధికంగా తీసుకెళ్లడంతో తిరుపతి మార్కెట్‌కు రావడం తగ్గింది. మార్కెట్‌కు కొత్త సరుకు వస్తేనే ధరలు తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం వస్తున్న సరుకు షాపులకు చాలడంలేదు. ఒక్కో దుకాణానికి కనీసం 10 కిలోలు కూడా ఇవ్వడంలేదని అంటున్నారు.

అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి గాలులు

సూళ్లూరుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బలహీనపడి.. మళ్లీ అల్పపీడనంగా మారిందని వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో 1.5 కిలోమీటర్ల మేర ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అల్పపీడన ప్రభావంతో వచ్చే 24 గంటలు నెల్లూరు, తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తీరం వెంబడి బలమైన గాలులు వీయనున్నాయి. రానున్న రెండు రోజులు రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే పలు పోర్టుల్లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. చలిగాలుల తీవ్రత కూడా అధికంగా ఉంటుందన్నారు.

జాతీయ తెలుగు పద్యాల పోటీలు

పలమనేరు, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి) : వేమన జయంతి సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు జాతీయ స్థాయి పద్యపోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షులు పి. తులసినాథంనాయుడు తెలిపారు. వందకుపైగా వేమన పద్యాలు చెప్పగలిగే పిల్లలు జనవరి 5వతేది లోపుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 9553429770 నంబరుకు వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవలన్నారు. జనవరి 18న పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

వేదోక్తంగా మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాల యంలో ధనుర్మాసం పురస్కరించుకుని గురువారం వేదోక్తంగా మనోన్మణి(గొబ్బెమ్మ) ఉత్సవం నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనం తరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారిని చప్పరం అధిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు.

మోడల్ డిపోగా కుప్పం ఆర్టీసీ డిపో



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న మునిరత్నం, కంచర్ల శ్రీకాంత్ తదితరులు

కుప్పం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపోను రాష్ట్రంలోనే మోడల్ డిపోగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం ఆర్టీసీ డిపోలో అయిదు బస్సు సర్వీసులను వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అయిదు సర్వీసుల్లో మూడు బస్సులు కుప్పం నుంచి విజయవాడకు, మరో రెండు కుప్పంనుంచి తిరుపతికి రాకపోకలు సాగిస్తాయన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఉన్న సర్వీసులు కూడా ఇతర డిపోలకు తరలి వెళ్లిపోయాయని విమర్శించారు, చాలా రూట్లలో బస్సు సర్వీసులు రద్దు చేయడంవల్ల విద్యార్థులు, రైతులు, ఇతర వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పాత సర్వీసులను పునరుద్ధరించడంతోపాటు కొత్త సర్వీసులను తీసుకొస్తున్నారని చెప్పారు.డిపోను కూడా ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు.

నేర రహిత మండలంగా వి.కోట

● ఎస్పీ మణికంఠ చందోలు ● సీసీ కెమెరాలతో పాటు కంట్రోల్ యూనిట్ ప్రారంభం



వి.కోట స్టేషన్‌లో సీసీ కెమెరాల కంట్రోల్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

వి.కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన వి.కోటను నేర రహిత మండలంగా మార్చడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. గురువారం వి.కోట అర్బన్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ సోమశేఖర్ రెడ్డిల నేతృత్వంలో సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. పట్టణానికి చెందిన దశరథరెడ్డి సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో పట్టణంలో ఏర్పాటు చేసిన 54 సీసీ కెమెరాలను, వాటి కంట్రోల్ యూనిట్‌ను ఎస్పీ ప్రారంభించారు. అపహరణలు, రోడ్డు ప్రమాదాలు, వాహన దొంగతనాలలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అనంతరం వి.కోట అర్బన్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల పురోగతి, స్టేషన్‌లలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. మహిళలు, చిన్న పిల్లల కేసులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట పలమనేరు డీఎస్పీ డి.ప్రభాకర్, అర్బన్ సీఐ సోమశేఖర్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, వి.కోట, బైరెడ్డిపల్లె ఎస్‌ఐలు బాబు, పరశురాం, ఏఎస్‌ఐలు మురళీరెడ్డి, జయకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మూతపడిన జైల్ పరిశీలన

పలమనేరులో బ్రిటీష్ హయాంలో కట్టి దశాబ్దం క్రితం మూతపడిన సబ్‌జైల్‌ను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు గురువారం పరిశీలించారు. వి.కోట వెళ్తూ మార్గమధ్యలో పలమనేరులో మూతపడిన సబ్‌జైల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా జైళ్లశాఖ అధికారి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం


తోటవారిపల్లిలో పర్యటిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీలో గురువారం చల్లా రామచంద్రారెడ్డి పర్యటించారు. ముందుగా తోటవారిపల్లిలోని టీడీపీ నాయకుడు మునేంద్ర నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కూటమి నాయకులు ప్రజలకు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ సభ్యులు ఉయ్యాల రమణ, టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, పూల రమేష్, రెడ్డెప్పనాయుడు, మోహన్‌దాస్, భాస్కర్, అబ్బాస్, నూర్‌భాషా, బాబునాయుడు, బాబయ్య, ఈఎం రత్నం, మహేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాటమరాజు వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు


కొక్కువారిపల్లిలో జరుగుతున్న చిట్లాకుప్ప ఏర్పాటు పనులు

కల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మూడోరోజు కనుమ పండుగ రోజున నిర్వహించే కాటమరాజు వేడుకలకు గ్రామాల్లో ఇప్పటి నుంచే ముందస్తు ఏర్పాటు పనులు చేస్తున్నారు. కనుమ పండుగ రోజున పశువులను సుందరంగా అలంకరించి కాటమరాజు ఆలయం వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వహించి పశువులకు ప్రసాదం పెడుతారు. అనంతరం చిట్లాకుప్పకు నిప్పుపెట్టి పశువులను బెదిరిస్తారు. ఇందులో భాగంగా మండలంలోని దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లిలో గురువారం కాటమరాజు ఆలయం వద్ద వేడుకలకు ముందస్తు పనులు నిర్వహించారు. పనులను టీడీపీ నాయకులు లెక్కల ధనంజయనాయుడు, వకాయలపాటి మురళీధర్‌నాయుడు పర్యవేక్షించారు.

అర్ధాంతరంగా సచివాలయ నిర్మాణ పనులు


నెల్లిమందలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

సోమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నెల్లిమంద పంచాయతీలోని సచివాలయ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో సచివాలయ ఉద్యోగులు పాత పంచాయతీ భవనంలోనే ఇరుకు గదిలోనే కార్యాలయాన్ని నడుపుతున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు కూర్చోవడానికి సైతం స్థలం లేకపోవడంతో రోడ్డుపై నిలబడుతున్నారు. అలాగే సచివాలయం వద్ద నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రమాదంలో గాయపడిన ఉద్యోగి మృతి


మృతిచెందిన రెడ్డిశేఖర్

సోమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉద్యోగి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సోమల మండలం పెద్దఉప్పరపల్లెకు చెందిన రెడ్డిశేఖర్ (35) బెంగళూరులోని ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా ముళబాగల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్‌కు నిప్పు పెట్టారని ఫిర్యాదు


కాలిన ట్రాక్టర్ టైర్లు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో తన ఇటుకల బట్టీల షెడ్డులో ఉన్న ట్రాక్టర్‌కు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని బాధితుడు శేషేగౌడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్‌కు నిప్పు పెట్టడంతో టైర్లు, స్టీరింగ్ కాలిపోయాయని.. సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని వాపోయారు. ఇదే ట్రాక్టర్‌కు గత 4 నెలల క్రితం నిప్పు పెట్టడంతో మరమ్మతులు చేయించుకున్నానని, రెండోసారి ఇలా జరిగిందన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ


మాట్లాడుతున్న యమలా సుదర్శనం

పుంగనూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు రాజకీయం చేస్తున్నాయని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం ఆరోపించారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజా భవన్‌లో జరిగిన మాలల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించాల్సి ఉందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు రాజ్యాంగానికి వ్యతిరేకంగా రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చనే విధంగా తీర్పునివ్వడం సరికాదన్నారు. ఈనెల 30న పుంగనూరులో మాలల మహాగర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా మాల విద్యార్థులు, మేధావులు, మహిళలు అధికంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు అశోకుమార్, శ్రీనివాసులు, మహానంది, శ్రీనివాసులు, గౌతమి, చంద్ర, వైవీరమణ, ఆనంద్, ఆంజిప్ప, మునిస్వామి, జెవీ నాగరాజు, కమ్మిరెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపు యజమానిపై దాడి


సీఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేస్తున్న మందుల దుకాణాల సంఘ ప్రతినిధులు

పుంగనూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న మెడికల్ షాపు యజమానిపై కొందరు దాడి చేసి షాపులోని రూ. 50 వేలు దోచుకెళ్లారని బాధితుడు గురువారం సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుడికి మద్దతుగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భానుప్రకాష్, మెడికల్ షాపు యజమాని చంద్రశేఖర్‌రెడ్డి సీఐకి ఫిర్యాదు చేసి మీడియాతో మాట్లాడారు. బుధవారం రాత్రి రాజేశ్వరి మెడికల్‌షాపులో చంద్రశేఖర్‌రెడ్డి ఉండగా.. బీఆర్ పిక్చర్‌ప్యాలెస్ సమీపంలోని మధురాయల్, మరో ఐదుగురు కిరాయి రౌడీలు మద్యం మత్తులో వెళ్లి సంబంధం లేకుండా దుర్భాషలాడుతూ దాడి చేసి ఫర్నీచర్, అద్దాలు ధ్వంసం చేశారన్నారు. షాపులో ఉన్న రూ.50 వేలు నగదు తీసుకెళ్లారని తెలిపారు. ఎవరికైనా అన్యాయం జరిగితే పోలీసులు, సంఘాలతో పరిష్కరించుకోవాలని.. రౌడీయిజం చేయడం తగదన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసు విచారించి చర్యతీసుకుంటానని సీఐ తెలిపారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం జయకుమార్‌రెడ్డి

సదుం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటాన్ని ఆవిష్కరించిన హెచ్ఎం జయకుమార్ రెడ్డి గణిత శాస్త్రంలో ఆయన సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. గణిత అధ్యాపకులు వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుంగనూరులో ఉరుసు ప్రారంభం

పుంగనూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై వెలసిన హజరత్ ఖాదరవల్లీ బాబా వారి ఉరుసు వేడుకలు గురువారం మతగురువులు ప్రారంభించారు. స్థానిక కుమ్మరవీధిలోని మదీనా మసీదులో మధ్యాహ్నం నమాజ్ తర్వాత మఖాన్ వద్దకు ముస్లిం సోదరులు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల షోరూం ప్రారంభం


వి.కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలోని ధర్మక్షేత్రంలో ఏడీఎంఎస్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల షోరూంను గురువారం ప్రారంభించారు. సీఎం చంద్రబాబు పీఏ మనోహర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, షోరూం మేనేజింగ్ పార్టనర్లు విశ్వనాథ్, సుబ్రహ్మణ్యం శెట్టి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి పూజలు

కల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, పూజలు చేపట్టారు.

రహదారి వెలుగుతోంది..!

● బటర్ ఫ్లై విద్యుద్దీపాలను ప్రారంభించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


విద్యుద్దీప కాంతులతో రహదారి


విద్యుద్దీపాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, మున్సిపల్ కమిషనర్

కుప్పం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ప్రధాన రహదారులన్నీ ఎల్ఈడీ లైట్లతో వెలుగులీనుతున్నాయి. కొన్ని రహదారులు అందంగా తయారైనా సరైన వెలుగులకు దూరంగా ఉండిపోయాయి. కుప్పం చెరువుకట్ట నుంచి బైపాస్ రోడ్డు సర్కిల్ వరకు ఉన్న రోడ్డు రహదారిలోని డివైడర్‌లో ఇటీవల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బటర్ ఫ్లై లైట్లను అమర్చారు. గురువారం సాయంత్రం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లతో కలిసి లైట్లను ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి వీధిలోనూ విద్యుత్తు బల్బులు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి స్తంభాలతోపాటు వీధి లైట్లు అమర్చుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, సిబ్బందిని ప్రశంసించారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, ఎమ్మార్.సురేశ్, మైనారిటీ సెల్ నాయకుడు జాకిర్, వేలు, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచి వీజీ ప్రతాప్, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వీటినిలా వదిలేస్తారా?

రోడ్డుపై సంచరిస్తున్న ఆవులతో పొంచి ఉన్న ప్రమాదం


వేలూరు రోడ్డుపై ఉన్న ఆవులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో తిరిగే ఆవులను అరికట్టడంలో నగరపాలక సంస్థ అధికారులు విఫలమయ్యారు. ప్రధానంగా ఈ ఆవులు భారీ వాహనాలు రాకపోకలు సాగించే రోడ్లపైనే తిష్ఠ వేస్తున్నాయి. నగరపాలక పరిధిలోని కొన్ని డివిజన్లలో ఆవులను పోషిస్తున్నారు. ఉదయాన్నే వీటిని నగరంలోకి వాటి యజమానులు వదిలేస్తున్నారు. దీంతో ఇవి.. బజారు వీధి, కూరగాయల మార్కెట్‌లతో పాటు పలు వీధుల్లో తిరుగుతున్నాయి. కూరగాయల వ్యర్థాలు, హోటళ్లలో మిగిలిపోయిన భోజనం, తదితర వాటిని తినడంతోపాటు దుకాణాల్లోని తినుబండారాల ప్యాకెట్లను లాగడం, ఇతర వస్తువులను తోసేస్తున్నాయి. ఒక్కోసారి వాహనాల శబ్దానికి భయపడి జనాలపైకి వచ్చేస్తున్నాయి. వీటివల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలూ ఉన్నాయి. గురువారం కూడా ఓ వ్యక్తి ఇలాగే ఆవు రోడ్డుకు అడ్డుగా రావడంతో కిందపడి గాయపడ్డారు. నగరపాలక అధికారులు అప్పుడప్పుడూ ఇటువంటి ఆవులను పట్టుకుని సంబంధిత యజమానికి నోటీసు జారీ చేసి వదిలేస్తున్నారు. చర్యలు తీసుకుందామంటే స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి వస్తోందని ప్రజారోగ్యశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా పడిమెట్ల పూజోత్సవం


పూజలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు

సదుం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సదుం మండలం ఎర్రాతివారిపల్లె బురుజు కొండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారి పడిమెట్ల పూజోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పడిమెట్లను సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు నంబూద్రి నారాయణన్ శబరిమలై ఆలయ సాంప్రదాయ రీతిలో పడిమెట్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


అలంకరణలో అయ్యప్పస్వామి పడిమెట్లు

పాఠశాలలో పారిశుధ్యం అధ్వానం


జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి ట్యాంకు వద్ద మురుగు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో పారిశుధ్య లోపంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు, మురుగునీటి నిల్వలతో దోమలు.. విషపురుగుల బెడదతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అలాగే తాగునీటి ట్యాంకు వద్ద పారిశుధ్య లోపం కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇకనైనా చర్యలు తీసుకోవాల్సి ఉంది.


పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

గ్రామాల్లోనే భూ సమస్యలకు పరిష్కారం


ఎస్.బండపల్లెలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు పార్వతి

కల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తహసీల్దారు జయసింహ తెలిపారు. పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లి రెవెన్యూ గ్రామం పాపిరెడ్డిగారిపల్లి సచివాలయం ప్రాంగణంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్ఐ దొరస్వామి పాల్గొన్నారు.

● చౌడేపల్లె: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు డీటీ మాధవి పేర్కొన్నారు. గురువారం లద్దిగం పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై 9 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ గుణశేఖర్, ఆర్ఐ భారతి, వీఆర్‌వోలు, దేవదాయశాఖ సిబ్బంది సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: మండలంలోని గానుగచింతగ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దారు కిరణ్ కుమార్ సమస్యలపై వినతులు స్వీకరించి 45 రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సదస్సులో డీటీ లోకేష్, టీడీపీ నాయకులు అమరనాథరెడ్డి, కృష్ణమనాయుడు, ముద్దుకృష్ణ, మధునాయుడు పాల్గొన్నారు.

●వి.కోట: ఎస్.బండపల్లెలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి తహసీల్దారు పార్వతి 20 అర్జీలను స్వీకరించారు. సర్పంచ్ విష్ణు, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, నేతలు రాంబాబు, సతీష్ గంట్లప్పగౌడు, పాల్గొన్నారు.

●పుంగనూరు రూరల్ : రెవెన్యూ సదస్సుల్లోనే సమస్యలు పరిష్కరిస్తున్నామని పుంగనూరు తహసీల్దారు రాము తెలిపారు. గురువారం స్థానిక మేలుపట్ల సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈవో ఏకాంబరం, వీఆర్వో నాగేంద్రనాథరెడ్డి, నాయకులు దినేష్, పగడాల రమణ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీ బహుజనుల హక్కుల సాధన కమిటీ ఎంపిక


నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న కృష్ణమూర్తి

పుంగనూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ బహుజనుల హక్కుల సాధన నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులు టి.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం పుంగనూరులో జరిగిన బహుజనుల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా ప్రతిభ భారతి, ఉపాధ్యక్షులుగా వెంకటరమయ్య, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షురాలుగా షబాన, వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా శివప్రసాద్, రాష్ట్ర లీగల్ అడ్వజర్‌గా శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శిగా చిట్టెమ్మ, యువజన మహిళా అధ్యక్షురాలుగా చైత్ర, కోశాధికారిగా సుబ్బన్న, జిల్లా ఉపాధ్యక్షులుగా నాగరాజ, ఆర్.గంగులప్ప, పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా బి. గంగులప్ప, గంపల గంగరాజు తదితరులను ఎనుకున్నట్లు తెలిపారు.

దాడి కేసులో నిందితుడికి ఏడాది జైలు


నిందితుడు మంజునాథ్

చిత్తూరు లీగల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దాడికేసులో ఓ నిందితుడిని చిత్తూరు న్యాయస్థానం ఏడాది జైలు, జరిమానా విధిస్తూ తీర్పుచెప్పింది. గంగాధర నెల్లూరు మండలం పి.బి.అగ్రహారం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన మునివెంకటేశులు కుమారుడు మంజునాథ్ దాడిచేశాడు. దీంతో ప్రేమ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై గంగాధరనెల్లూరు పోలీసులు 2003 ఫిబ్రవరి 21వ తేదీన మంజునాథ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ కేసు గురువారం మొబైల్ కోర్టులో వాయిదా ఉండగా, పూర్వాపరాలను పరిశీలించిన మొబైల్ కోర్టు ఇన్‌చార్జి, మూడో కోర్టు జడ్జి శ్రీనివాసులు.. నిందితుడికి ఏడాది జైలు, రూ.8వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసును ఏపీపీ స్వాతి వాదించారు.

చోరీకి గురైన బంగారు నగల స్వాధీనం


నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

గుడిపాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీకి గురైన బంగారు నగలను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు. గురువారం ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. పాపసముద్రం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి ఇంట్లో గతనెల 17వ తేదీన నాలుగు బంగారు గాజులు, నల్లపూసల దండ, రెండు నవరాల చైన్ మొత్తం 114 గ్రాముల బంగారు నగలను నెల్లూరుజిల్లాకు చెందిన శ్రీనివాసరెడ్డి అపహరించుకుని వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసి, నగలను రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

11న మండలస్థాయి క్రికెట్ పోటీలు

సోమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమల శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనవరి 11న క్రికెట్, షటిల్ మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డి.సునిల్, వి.వినోద్‌కుమార్‌లు తెలిపారు. జనవరి 9లోపు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. క్రికెట్ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, షటిల్ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.వెయ్యి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్‌నంబర్లు 9130233630 , 9398813123 లను సంప్రదించాలని కోరారు.

తగ్గిన టమోటా ధరలు

సోమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు భారీగా పతనమయ్యాయి. 15 కిలోల బాక్సు రూ.100 నుంచి రూ.150 లోపు పలుకుతున్నాయి. ఎకరా టమోటాల సాగుకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులతో సాగు చేస్తే ధరలు లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. సోమల నుంచి పలమనేరు, పుంగనూరు, కోలారు మార్కెట్లకు టమోటాలు రవాణా చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో టమోటా తోటలు దెబ్బతిన్నాయి.

12 మంది వైసీపీ నాయకుల బైండోవర్

సోమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరులో ఈనెల 21న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైసీపీ నాయకులు టపాసులు పేల్చారు. ఆ సమయంలో సమీపంలోని దుకాణం వద్ద ఉన్న టీడీపీ నాయకుడు నౌషాద్ పై టపాసుల నిప్పులు పడ్డాయి. ఈ సందర్భంగా వైసీపీ నాయకులకు, నౌషాద్‌కు స్వల్ప వివాదం జరిగింది. నౌషాద్ ఫిర్యాదుతో సోమల పోలీసులు గురువారం ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచి బాషా మసూద్‌తోపాటు మరో 10 మంది వైసీపీ నాయకులను బైండోవర్ చేసుకున్నారు.

టీటీడీ కల్యాణ మండపం నిర్మించాలి

బైరెడ్డిపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలో టీటీడీ కల్యాణమండపం నిర్మించాలని కోరుతూ గురువారం టీటీడీ పాలక మండలికి వినతిపత్రాన్ని పంపినట్లు డీసీసీ కార్యదర్శి రమణప్ప తెలిపారు. ప్రస్తుతం బైరెడ్డిపల్లెలో ప్రైవేటు కల్యాణ మండపాలున్నా సామాన్య, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు జరుపుకోవాలంటే అధికంగా అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో 21 పంచాయతీలు ఉన్నాయని.. ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని టీటీడీ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 27న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ టీకే స్వామి తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు, సమస్యలపై ఫోన్‌నంబరు 9959225678 కు ఫిర్యాదు చేయాలని కోరారు.

చైన్ స్నాచర్ అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్ఐ చిన్నరెడ్డెప్ప

పాలసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ చిన్నరెడ్డెప్ప తెలిపారు. కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన లేట్ శ్రీనివాసులు భార్య విమలకుమారి ఈనెల 15వ తేదీన తమ పశువులను పొలానికి తీసుకెళుతున్నారు. ఆ సమయంలో గంగాధరనెల్లూరు మండలం ముక్కళ్లత్తూరుకు చెందిన లోకనాథం కుమారుడు రాంకీ ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి ఆమెవద్దకొచ్చాడు. ఇక్కడ పెట్రోల్ ఎక్కడ విక్రయిస్తారని అడుగుతూ ఉన్నట్టుండి ఆమె మెడలోని 28 గ్రాముల బంగారు చైనును లాక్కొని పరారయ్యాడు. గురువారం కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఆదేశాలతో టీపీఎస్ఆర్‌పురం క్రాస్ వద్ద ఎస్ఐ.. వాహనాలు తనిఖీ చేస్తుండగా రాంకీని అనుమానంతో ఆపారు. విచారించగా బంగారు చైన్ లాక్కెళ్లింది తానేనని.. గంగాధరనెల్లూరులోని ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువ పెట్టినట్లు చెప్పాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గొలుసును రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

షాదీ ఖానా నూతన కమిటీ నియామకం



సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఉర్దూ షాదీ ఖానా నూతన కమిటీని నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నియామక పత్రాలను నూతన కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ కన్వీనర్‌గా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి, సభ్యులుగా ఎ.అన్సర్, షేక్ హకీమ్ గౌస్ బాషా, ఎండీ షరీఫ్, ఆర్ మహబూబ్ బాషా, మహిళా సభ్యులుగా ఎస్.షహిదున్నీసా బేగం ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కృషిచేస్తుందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ భాయ్, నగర మైనార్టీ అధ్యక్షుడు అత్తు భాయ్, నేతలు జిలాని, శిరాజ్ భాయ్, రఫి పాల్గొన్నారు.

గంటా కమలమ్మ సాహితీ పురస్కారాల విజేతలు వీరే

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దివంగత గంటా కమలమ్మ 2024 సంవత్సరం సాహితీ పురస్కారాల పోటీల్లో శ్రీకాకుళం వాసి సాంబమూర్తి లండ రచించిన నాలుగు రెక్కలపిట్ట, నల్గొండవాసి తుల శ్రీనివాసులు రచించిన చింతల తొవ్వ సాహితీ సంపుటాలు ఎంపిక అయ్యాయి. ఈ మేరకు చిత్తూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు గంటా మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరిలో విజేతలకు రూ.10వేల చొప్పున నగదు పురస్కారం అందజేస్తామని వివరించారు.

12 మంది వైసీపీ నాయకుల బైండోవర్

సోమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరులో ఈనెల 21న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైసీపీ నాయకులు టపాసులు పేల్చారు. ఆ సమయంలో సమీపంలోని దుకాణం వద్ద ఉన్న టీడీపీ నాయకుడు నౌషాద్‌పై టపాసుల నిప్పులు పడ్డాయి. ఈ సందర్భంగా వైసీపీ నాయకులకు, నౌషాద్‌కు స్వల్ప వివాదం జరిగింది. నౌషాద్ ఫిర్యాదుతో సోమల పోలీసులు గురువారం ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచి బాషా మసూద్‌తోపాటు మరో 10 మంది వైసీపీ నాయకులను బైండోవర్ చేసుకున్నారు.

కృష్ణాపురం రిజర్వాయర్ గేటు ఎత్తివేత



వెదురుకుప్పం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ గేటును గురువారం రాత్రి ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో అధికంగా ఉండటంతో నీటిని దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖ పేర్కొంది.

హెచ్‌ఎంకు ఆత్మీయ వీడ్కోలు

పెనుమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ.. పదవీ విరమణ చేస్తున్న వెంకటేశులునాయుడికి గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. గురువారం పాఠశాలలో వెంకటేశులునాయుడు దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంఈవో భాస్కర్‌నాయుడు, హెచ్‌ఎంలు మంజుల, సంధ్య, రాధాకృష్ణ, యామిని, చిత్తూరు, కణ్ణన్, ఆముదాల హైస్కూల్, ఎమ్మార్సీ బృందాలు పాల్గొన్నారు.



వెంకటేశులు నాయుడు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వరసిద్ధుడి సేవలో ఎక్సైజ్ శాఖ కార్యదర్శి



ఆలయంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, ఎక్సైజ్ శాఖ కార్యదర్శిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అతిథి గృహంలో మర్యాదపూరకంగా కలసి, సన్మానించారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, ఎక్సైజ్ శాఖ ఈఎస్‌లు శ్రీనివాస్, నాగమల్లేశ్వర్, ఆలయ ఏఈవో రవీంద్రబాబు, తహసీల్దార్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాడర్‌కు అండగా ఉంటాం: వైసీపీ నేతలు



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్య ఏదైనా సమష్టిగా ఎదుర్కొందాం.. క్యాడర్‌కు అండగా ఉంటామని వైసీపీ నాయకులు అన్నారు. నగరి నియోజకవర్గ వైసీపీ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నగరి ఏజేఎస్ కల్యాణ మండపంలో గురువారం మాజీ మంత్రి ఆర్కే రోజా అధ్యక్షతన జరిగింది. ఉమ్మడిజిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. గతంలో అడ్డదారిలో పదవులు పొంది ఐదేళ్లు అనుభవించి.. చివరలో పార్టీకి వెన్నుపోటు పొడిచిన ద్రోహుల వల్ల పార్టీ క్యాడర్ నిరుత్సాహానికి గురైందన్నారు. ఇకపై అడ్డదారిలో వచ్చేవారికి ఏనాయకుడు సహకరించినా ఊరుకోమంటూ హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ అన్నారేకానీ ప్రస్తుతం బాదుడే.. బాదుడు అంటూ నిరుపేదల నడ్డి విరుస్తున్నారన్నారు. రైతులకు, చేనేత కార్మికులకు, యువతకు, ఎస్సీ, ఎస్టీలకు మద్దతుగా శుక్రవారం పుత్తూరులో భారీస్థాయిలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. నగరి, నిండ్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేట మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, నగరి, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్లు, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశమ్మకు కానుకగా వెండిపాత్రలు



నగరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని టీఆర్‌కండ్రిగ వద్ద ఉన్న దేశమ్మ ఆలయానికి దుర్గాప్రసాద్‌రెడ్డి, పూజ కలిసి 600 గ్రాముల బరువున్న వెండి పాత్రలను కానుకగా అందజేశారు. నీలకంఠం, గుణశేఖర్, చెంచయ్య, మోహనకృష్ణ, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా గణిత మేళా

వెదురుకుప్పం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం కేశవులు అధ్యక్షతన గణిత మేళా కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గణిత ఉపాధ్యాయుడు రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి గణితాన్ని ఇష్టంగా నేర్చుకుంటే ఉన్నతస్థానానికి ఎదగవచ్చని తెలియజేశారు. సూపర్‌మ్యాన్, స్పైడర్ మ్యాన్ కన్నా గణిత మనిషి గొప్పవాడంటూ పదో తరగతి విద్యార్థి ధరణికుమార్ వేషధారణ ఆకట్టుకుంది. నిజ జీవితంలో గణితం ప్రాముఖ్యాన్ని ఐదో తరగతి విద్యార్థులు పాట రూపంలో తెలియజేశారు. వ్యాయామ సంచాలకుడు తిరుమలరాజు, టీచర్లు సరస్వతి, హరిత, మాలతి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుమతి, ఢిల్లీబాబు, చిన్నయ్యశెట్టి, రాములు పాల్గొన్నారు.



గణిత నమూనాలతో విద్యార్థులు

ఐరాలలో చిరుజల్లులు

ఐరాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐరాలలో గురువారం ఉదయం చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం సమయం కొంతసేపు వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొంత ఇబ్బందికి గురయ్యారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

వెదురుకుప్పం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు తెలిపారు. గురువారం కార్వేటినగరం మండలంలోని ఈదువారిపల్లెలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రైతుల నుంచి వినతిపత్రాలను తహసీల్దార్ స్వీకరించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ ఉమ తెలిపారు. గురువారం కార్వేటినగరం మండలం కేఎం పురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల బీమా, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో హేమలత, ఉద్యోగులు హాజరయ్యారు.





కలెక్టరేట్ ఎదురుగా చిత్తూరు - వేలూరు రోడ్డుపై ఉన్న ఆవులు

వీటినిలా వదిలేస్తారా?
రోడ్డుపై సంచరిస్తున్న ఆవులతో పొంచి ఉన్న ప్రమాదం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో తిరిగే ఆవులను అరికట్టడంలో నగరపాలక సంస్థ అధికారులు విఫలమయ్యారు. ప్రధానంగా ఈ ఆవులు భారీ వాహనాలు రాకపోకలు సాగించే రోడ్లపైనే తిష్ఠ వేస్తున్నాయి. నగరపాలక పరిధిలోని కొన్ని డివిజన్లలో ఆవులను పోషిస్తున్నారు. ఉదయాన్నే వీటిని నగరంలోకి వాటి యజమానులు వదిలేస్తున్నారు. దీంతో ఇవి.. బజారు వీధి, కూరగాయల మార్కెట్‌లతోపాటు పలు వీధుల్లో తిరుగుతున్నాయి. కూరగాయల వ్యర్థాలు, హోటళ్లలో మిగిలిపోయిన భోజనం, తదితర వాటిని తినడంతోపాటు దుకాణాల్లోని తినుబండారాల ప్యాకెట్లను లాగడం, ఇతర వస్తువులను తోసేస్తున్నాయి. ఒక్కోసారి వాహనాల శబ్దానికి భయపడి జనాలపైకి వచ్చేస్తున్నాయి. వీటివల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలూ ఉన్నాయి. గురువారం కూడా ఓ వ్యక్తి ఇలాగే ఆవు రోడ్డుకు అడ్డుగా రావడంతో కిందపడి గాయపడ్డారు. నగరపాలక అధికారులు అప్పుడప్పుడూ ఇటువంటి ఆవులను పట్టుకుని సంబంధిత యజమానికి నోటీసు జారీ చేసి వదిలేస్తున్నారు. చర్యలు తీసుకుందామంటే స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి వస్తోందని ప్రజారోగ్యశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప

పాలసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ చిన్నరెడ్డెప్ప తెలిపారు. కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన లేట్ శ్రీనివాసులు భార్య విమలకుమారి ఈనెల 15వ తేదీన తమ పశువులను పొలానికి తీసుకెళుతున్నారు. ఆ సమయంలో గంగాధరనెల్లూరు మండలం ముక్కళ్లత్తూరుకు చెందిన లోకనాథం కుమారుడు రాంకీ ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి ఆమెవద్దకొచ్చాడు. ఇక్కడ పెట్రోల్ ఎక్కడ విక్రయిస్తారని అడుగుతూ ఉన్నట్టుండి ఆమె మెడలోని 28 గ్రాముల బంగారు చైనును లాక్కొని పరారయ్యాడు. గురువారం కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఆదేశాలతో టీవీఎన్‌ఆర్‌పురం క్రాస్ వద్ద ఎస్‌ఐ.. వాహనాలు తనిఖీ చేస్తుండగా రాంకీని అనుమానంతో ఆపారు. విచారించగా బంగారు చైన్ లాక్కెళ్లింది తానేనని.. గంగాధరనెల్లూరులోని ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువ పెట్టినట్లు చెప్పాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంగారు గొలుసును రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి: జడ్పీ సీఈవో

పూతలపట్టు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై అధికారులు దృష్టిపెట్టాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. గురువారం ఆయన ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఓంశక్తి భక్తుల అన్నదానం



గుడిపాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోలావూరులో గురువారం ఓంశక్తి భక్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పురవీధుల్లో ఊరేగించారు. నిర్వాహకుడు మధుసూదన్ నాయుడు, ఎర్రబ్బ నాయుడు, చిన్నబ్బ నాయుడు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్‌ను కలసిన నేతలు




వెదురుకుప్పం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డిని గురువారం తాడేపల్లిలో కార్వేటినగరానికి చెందిన తెలుగు రైతు కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి మాదిరాజు జనార్దనరాజు, రైతు నాయకుడు నాగేశ్వరరాజు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చారు.

కరపత్రాల ఆవిష్కరణ



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి ఐదో తేదీన విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే హైందవ శంఖారావంకు జిల్లా నుంచి హిందూ సోదరులు తరలి రావాలని చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పిలుపునిచ్చారు. గురువారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు పోతుల రామ్మూర్తి, సురేందర్ రెడ్డి, వేలు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ



నామినేషన్లు స్వీకరిస్తున్న సీనియర్ న్యాయవాది వసంత్‌కుమార్

చిత్తూరు లీగల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కోర్టు పరిధిలో ఉన్న న్యాయవాదుల సంఘానికి వచ్చేనెల మూడో తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల అధికారిగా నియమితులైన సీనియర్ న్యాయవాది జి.వసంత్‌కుమార్ గురువారం నామినేషన్లను స్వీకరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్ష పదవికి ఐదుగురు పోటీపడడంతోపాటు మొత్తం 28 మంది పలు పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు.

ఖోఖో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నగరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నారాయణ పాఠశాలల ప్రీమియర్ లీగ్ సీనియర్ విభాగం ఖోఖో పోటీల్లో నగరి పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ కార్తీక్ తెలిపారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు ముఖ్యఅతిథిగా హాజరవగా, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దాడికేసులో నిందితుడికి ఏడాది జైలు



నిందితుడు మంజునాథ్

చిత్తూరు లీగల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దాడికేసులో ఓ నిందితుడిని చిత్తూరు న్యాయస్థానం ఏడాది జైలు, జరిమానా విధిస్తూ తీర్పుచెప్పింది. గంగాధరనెల్లూరు మండలం పి.బి.అగ్రహారం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన మునివెంకటేశులు కుమారుడు మంజునాథ్ దాడిచేశాడు. దీంతో ప్రేమ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై గంగాధరనెల్లూరు పోలీసులు 2003 ఫిబ్రవరి 21వ తేదీన మంజునాథ్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపించారు. ఈ కేసు గురువారం మొబైల్ కోర్టులో వాయిదా ఉండగా, పూర్వాపరాలను పరిశీలించిన మొబైల్ కోర్టు ఇన్‌చార్జి, మూడో కోర్టు జడ్జి శ్రీనివాసులు.. నిందితుడికి ఏడాది జైలు, రూ.8వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసును ఏపీపీ స్వాతి వాదించారు.

చోరీకి గురైన బంగారు నగల స్వాధీనం: నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

గుడిపాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీకి గురైన బంగారు నగలను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు. గురువారం ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. పాపసముద్రానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి ఇంట్లో గతనెల 17వ తేదీన నాలుగు బంగారు గాజులు, నల్లపూసల దండ, రెండు సవరాల చైన్ మొత్తం 114 గ్రాముల బంగారు నగలను నెల్లూరుజిల్లాకు చెందిన శ్రీనివాసరెడ్డి అపహరించుకుని వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ఎంసీఆర్ క్రాస్ వద్ద నిందితుడిని పట్టుకుని, నగలను రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించండి

ఐరాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధిస్తే వాతావరణానికి చాలా మేలు జరుగుతుందని తిరుపతి వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డి రాము అన్నారు. 35యర్లంపల్లెలో గురువారం తిరుపతి వ్యవసాయ కళాశాల, చిత్తూరు ఏరువాక కేంద్రం విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపు ప్రారంభించారు. ఏరువాక సమన్వయకర్త సంధ్యారాణి, లావణ్య అసిస్టెంట్ ప్రొఫెసర్ లావణ్య పాల్గొన్నారు.

మండలాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం



రాంప్రసాద్ గౌడ్ (నిండ్ర)



ప్రసాద్ (పూతలపట్టు)

నిండ్ర/పూతలపట్టు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిండ్ర బీజేపీ అధ్యక్షుడిగా వేదాంతపురానికి చెందిన అత్తిరాల రాంప్రసాద్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ● పూతలపట్టు బీజేపీ అధ్యక్షుడిగా పూతలపట్టుకు చెందిన ఎం.ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తగ్గిన టమోటా ధరలు

సోమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు భారీగా పతనమయ్యాయి. 15 కిలోల బాక్సు రూ.100 నుంచి రూ.150 లోపు పలుకుతున్నాయి. ఎకరా టమోటాల సాగుకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులతో సాగు చేస్తే ధరలు లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో టమోటా తోటలు దెబ్బతిన్నాయి.

పుంగనూరులో ఉరుసు ప్రారంభం

పుంగనూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై వెలసిన హజరత్ ఖాదరవల్లీ బాబా వారి ఉరుసు వేడుకలు గురువారం మతగురువులు ప్రారంభించారు. స్థానిక కుమ్మరవీధిలోని మదీనా మసీదులో మధ్యాహ్నం నమాజ్ తర్వాత మఖాన్ వద్దకు ముస్లిం సోదరులు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

గుంతలో దిగబడిన ప్రైవేటు బస్సు

యాదమరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర రహదారిపై ఓ ప్రైవేట్ బస్సు గోతిలో దిగబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుడియాత్తం రోడ్డులో గురువారం చిత్తూరు నుంచి తమిళనాడుకు వెళుతున్న బస్సు దేవళం వద్దకొచ్చింది. రహదారి మరమ్మతులు, తేలికపాటి వర్షం కురుస్తున్న కారణంగా అక్కడున్న గుంతలో బస్సు దిగబడిపోయింది. స్థానికులు ఎక్స్‌కవేటర్ సహాయంతో బస్సును గుంత నుంచి తొలగించే కార్యక్రమం చేపట్టారు.



దేవళం వద్ద గుంతలో దిగబడిపోయిన బస్సు వద్ద ప్రయాణికులు

సంక్షిప్తంగా..

అన్నదానం



చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఆర్.గోపినాథ్ జయంతి సందర్భంగా సంతపేట చౌక్‌లో ఆయన కుమారుడు భూపేష్ గోపినాథ్ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. మాజీ కౌన్సిలర్లు దేవరాజ్, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, జె.చిట్టి, శ్రీనివాసమూర్తి, సంతపేట డెవలప్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎంహెచ్‌వో



చిత్తూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన సుధారాణి గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమెవెంట అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి ఉన్నారు.

కార్మికుడి మృతికి సంతాపం



మట్టిఖర్చులకు డబ్బులను అందిస్తున్న ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ఆప్కాస్ ద్వారా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుడు రెడ్డెప్ప మృతిపై ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం కొట్రకోనకు వెళ్లి రెడ్డెప్ప మృతదేహానికి పూలమాల వేశారు. కుటుంబీకులను పరామర్శించి, నగరపాలక సంస్థ నుంచి మట్టి ఖర్చులకు రూ.15వేలను అందించారు.

దుప్పట్లు, చీరల వితరణ



బంగారుపాళ్యం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని రాగిమానుపెంట రోడ్డులోని సీఎస్ఐ చర్చిలో గురువారం 500 మంది అనాథలు, కుష్ఠు వ్యాధిగ్రస్తులు, వితంతువులు, పారిశుధ్య కార్మికులకు రోప్స్ సంస్థ ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు, పంచెలను వితరణ చేశారు. వీటిని చైర్మన్ ధనశేఖర్, డైరెక్టర్ శ్రీలత పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ ఎంబీ కృష్ణమూర్తి, సీఎంసీ డాక్టర్ బ్లెస్సీకీర్తన, డాక్టర్ ప్రీతి కారుణ్య, పారామెడికల్ ఆఫీసర్ మణి పాల్గొన్నారు.

నీటి సంఘ అధ్యక్షుడికి అభినందన



విజయపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కలియంబాకం చెరువు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గాలి రమేష్ నాయుడిని గురువారం చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు అభినందించారు. పార్టీ నాయకులు విజయకుమార్ నాయుడు, రాంబాబు నాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.